క్లుప్తంగా

కీలపట్లలో పంటల పరిశీలన



పొలం పిలుస్తోంది కార్యక్రమంలో అధికారులు

గంగవరం: మండలంలోని కీలపట్ల, కొత్తపల్లి గ్రామ పంచాయతీల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించారు. కీలపట్లలో ఏడీఏ మధుసూదన్‌రెడ్డి, కొత్తపల్లి గ్రామంలో జిల్లా వనరుల కేంద్రం నుంచి ఏడీఏలు విజయభాస్కర్‌రెడ్డి, నాగపద్మిణి కలసి ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఆయా పంచాయతీల్లోని రైతు సేవా కేంద్రాల్లో సంబంధిత రైతులతో సమావేశాలు నిర్వహించారు. అనంతరం కొత్తపల్లి గ్రామ పరిసరాల్లోని పంటలను పరిశీలించారు. కార్యక్రమంలో ఏఓ హేమలత, ఆర్‌ఎస్‌కే ఇన్‌చార్జ్‌లు, రైతులు పాల్గొన్నారు.

వ్యాధి నిరోధక టీకాలు తప్పనిసరి

బైరెడ్డిపల్లి: 16 ఏళ్ల లోపల ఉన్న పిల్లలకు తప్పనిసరిగా వ్యాధి నిరోధక టీకాలు వేయించాలని తీర్థం పీహెచ్‌సీ వైద్యాధికారి అరుణ్‌కుమార్ పేర్కొన్నారు. మండలంలోని దాసార్లపల్లెలో బుధవారం వ్యాధి నిరోధక టీకాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. వ్యాధి నిరోధక టీకాలు వేయించడం వలన అనేక వ్యాధుల నుంచి బిడ్డలకు రక్షణ కలుగుతుందన్నారు. హెల్త్ ఎడ్యుకేటర్ కాంతమ్మ, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

షెల్టరు ఉన్నా.. సేవలు సున్నా



కుంజాగానూరు వద్ద శిథిలమైన బస్ షెల్టర్

కుప్పంరూరల్: మండల కేంద్రం నుంచి గ్రామీణ ప్రాంతాలకు వెళ్లే ప్రయాణికుల కోసం నిర్మించిన బస్సు షెల్టర్ శిథిలావస్థకు చేరుకొని అలంకారప్రాయంగా మారింది. రెండు దశాబ్దాల కిందట నిర్మించిన షెల్టర్ కావడంతో ప్రస్తుతం పైకప్పు వర్షానికి ఉరుస్తోంది. మరోవైపు పైకప్పు పెచ్చులూడిపడుతుండడంతో ప్రయాణికులు షెల్టర్ లోపలికి వెళ్లడమే మానేశారు. దీంతో ప్రయాణికులకు గత్యంతరం లేక ఎండలకు ఎండుతూ.. వానలకు తడుస్తూ రోడ్డుపై నిలబడి బస్సుల కోసం నిరీక్షించాల్సిన దుస్థితి నెలకొంది. అధికారులు స్పందించి శిథిలమైన షెల్టర్ల స్థానంలో కొత్త బస్సు షెల్టర్‌ను నిర్మించాలని ప్రజలు కోరుతున్నారు.

పిడుగుపాటుకు కొబ్బరి చెట్టు దగ్ధం



పిడుగుపడి దగ్ధమవుతున్న కొబ్బరిచెట్టు

బైరెడ్డిపల్లి: మండలంలోని పాతురునత్తం శ్రీ రేవణ సిద్ధేశ్వరస్వామి ఆలయం వద్ద బుధవారం సాయంత్రం ఉరుములు, మెరుపులు వచ్చి కొబ్బరిచెట్టుపై పిడుగుపడి దగ్ధమైంది. ప్రజలకు ఎలాంటి ప్రమాదం జరగకపోవడంతో ఊపిరిపీల్చుకున్నారు.

సభ్యత్వాన్ని బాధ్యతగా భావించాలి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే అమరనాథరెడ్డి

పలమనేరు: పార్టీ సభ్యత్వాన్ని ఓ బాధ్యతగా భావించి రెన్యూవల్స్, కొత్త సభ్యత్వాలను భారీగా చేపట్టాలని పార్టీ శ్రేణులకు స్థానిక ఎమ్మెల్యే అమరనాథరెడ్డి దిశా నిర్దేశం చేశారు. స్థానిక పార్టీ కార్యాలయంలో నియోజకవర్గ టీడీపీ క్యాడర్ సమావేశం బుధవారం జరిగింది. ఆయన మాట్లాడుతూ గతంలో నుంచి కూడా టీడీపీకి క్యాడర్ చాలా బలంగా ఉందన్నారు. క్షేత్రస్థాయిలో క్యాడర్‌ను మరింత పెంచుకోనేందుకు నాయకులు కృషిచేయాలని సూచించారు. నేతలు ఆర్వీ బాలాజీ, విజయభాస్కర్‌రెడ్డి, కిశోర్‌గౌడ, రంగనాథ్ పాల్గొన్నారు.

కలెక్టర్‌ను కలసిన ఆర్డీఓ



కలెక్టర్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న పలమనేరు నూతన ఆర్డీఓ వెంకటేశ్

చిత్తూరు కలెక్టరేట్: నూతనంగా జిల్లాకు విచ్చేసిన పలమనేరు ఆర్డీఓ వెంకటేశ్ బుధవారం కలెక్టర్‌ను మర్యాద పూర్వకంగా కలసి పుష్పగుచ్ఛం అందజేశారు. పలమనేరు డివిజన్ పరిధిలోని ప్రజా సమస్యలు, రెవెన్యూ సమస్యల పరిష్కారానికి చిత్తశుద్ధితో విధులు నిర్వర్తించాలని కలెక్టర్ ఆయనకు సూచించారు.

సచివాలయాలు కంచికేనా?

- సచివాలయాల పర్యవేక్షణను గాలికొదిలిన ఎంపీడీఓలు
- వీరు చెప్పినా మాట వినరు
- ఆగిన అన్ని పౌర సేవలు
- పలుచోట్ల సచివాలయాలకు కనిపిస్తున్న తాళాలు



శంకర్రాయలపేట సచివాలయంలో ఖాళీ కుర్చీలే



సిబ్బంది కోసం ఎదురుచూస్తున్న జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు(ఫైల్)

పలమనేరు: గత ప్రభుత్వంలో ప్రజలకు ఎన్నో సేవలందించిన సచివాలయ వ్యవస్థ పతనావస్థకు చేరిందా? కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక వీరికి పనిపాట లేకుండా పోయింది. సచివాలయాల్లోని సిబ్బందిని సంబంధిత శాఖకు మెర్జ్ చేస్తారా లేదా వీటిని బలోపేతం చేస్తారా, అసలు సచివాలయ సిబ్బందిని వినియోగించుకుంటారా లేదా అనే సందిగ్ధత నెలకొంది. ఫలితంగా పనిలేదు కాబట్టి సచివాలయాల సిబ్బంది కార్యాలయాలకు రావడం, బయోమెట్రిక్ చేసుకోవడం సొంత పనులకెళ్లడం పలమనేరు నియోజకవర్గంలో సాగుతున్న తంతు. కొన్ని సచివాలయాల్లో అయితే సిబ్బంది మొత్తం బయోమెట్రిక్ వేసుకొని కార్యాలయానికి తాళం వేసి మరీ ఇళ్లకెళ్లిపోతున్నారు. జిల్లాలో ఎంపీడీఓల బదిలీలు జరిగాక కొత్తగా ఆయా మండలాల్లో విధుల్లో చేరిన ఎంపీడీఓలు సచివాలయాలకు సిబ్బంది వస్తున్నారా అని కూడా కన్నెత్తి చూడడం లేదు. సచివాలయాల పోర్టల్ ఎంపీడీఓల డ్యాష్‌బోర్డులో ఉన్నా వారు పట్టించుకోవడం లేదని తెలుస్తోంది. ఫలితంగా సచివాలయాల్లోని సిబ్బంది ఆడిందేఆట పాడిందేపాటగా తయారైంది. సచివాలయాలు కథ ఇక కంచికేనని అక్కడి సిబ్బంది సైతం భావించే విధులకు రాకుండా డుమ్మా కొడుతున్నట్టు అనిపిస్తోంది.

ఇప్పటి పరిస్థితి..

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక 540 సేవలు ఆపేశారు. ప్రభుత్వ పథకాల అమలు వీరితో లేదు. సంక్షేమ పథకాలు లేనందున వెల్ఫేర్ అసిస్టెంట్‌కు పనిలేదు. మహిళా పోలీసుల విధులు అటకెక్కాయి. వ్యవసాయ, అనుబంధ విభాగాల అధికారులు సచివాలయాల్లోని సిబ్బంది వాడుకోవడం మరిచారు. రెవెన్యూ శాఖకు చెందిన సర్వేయర్, వీఆర్వోలు తహసీల్దార్ కార్యాలయానికి పరిమితమయ్యారు. అనిమల్ హస్బెండరీ అసిస్టెంట్ ఎలా ఉంటాడో కూడా పాడి రైతులకు తెలియని పరిస్థితి. వీరికి ఏ పనులు లేనందున వారిలోనూ నిరాశక్తత నెలకొంది.

సచివాలయాల సిబ్బంది విధులిలా..

పంచాయతీ కార్యదర్శి: సెక్రటరీ గ్రేడ్‌-5..సాధారణ పరిపాలన, గ్రామంలో పారిశుద్ధ్యం, తాగునీటి సరఫరా, సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్ చూడాలి.
డిజిటల్ అసిస్టెంట్: గత ప్రభుత్వంలో 540 రకాల సేవలకు సంబంధించి కంప్యూటర్‌లో నిక్షిప్తం, ఆపై డాక్యుమెంటేషన్, అవసరమైన సర్టిఫికెట్ల జారీ ఉండేది.
వెల్ఫేర్ అసిస్టెంట్: ప్రభుత్వ పథకాల అమలు, బడుల్లో మధ్యాహ్నభోజనం పర్యవేక్షణ, శానిటేషన్ చూడాలి.
గ్రామ మహిళా సంరక్షణ కార్యదర్శి: అంగన్‌వాడీల పరిశీలన, గ్రామంలో శాంతిభద్రతల పరిరక్షణ.
వీఆర్వో: రెవెన్యూ సమస్యల పరిష్కారం
సిరికల్చర్, అగ్రికల్చర్, హార్టికల్చర్ అసిస్టెంట్లు: వీరు ఆయా శాఖలకు సంబంధించి సంబంధిత శాఖకు సహాయకులుగా ఉంటూ రైతు సేవా కేంద్రాల్లో రైతులకు సేవలందించాలి.
ఏఎన్‌ఎం: గ్రామంలోని ఆశాల సాయంతో అవసరమైన వైద్యసేవలను అందించాలి.
విలేజ్ సర్వేయర్: సంబంధిత పంచాయతీలో భూముల సరిహద్దులు చూపడం, రైతుల ఎఫ్‌లైన్ పిటిషన్లలో మండల సర్వేయర్‌కు సపోర్ట్‌గా ఉండాలి.
అనిమల్ హస్బెండరీ అసిస్టెంట్: గ్రామాల్లో పశువులకు అవసరమైన సేవలను పాడిరైతులకు అందించాలి.

నియోజకవర్గంలో సచివాలయాల వివరాలు	
5మండలాలు, మున్సిపాలిటీతో కలిపి	108
ఒక్కో సచివాలయంలో	10 మంది సిబ్బంది
మొత్తం సచివాలయాల్లో	1,100 మంది



వి.కోట మండలంలో మూతబడిన సచివాలయం ముందు జెడ్పీ చైర్మన్ (ఫైల్)

రోజుకు మూడు సార్లు బయోమెట్రిక్ ఉన్నా..

సచివాలయంలోని సిబ్బంది నిత్యం ఉదయం 10.30కు, మధ్యాహ్నం 2.30కు, సాయంత్రం 5 గంటలకు తప్పకుండా బయోమెట్రిక్ హాజరు చేసుకోవాలి. ఇప్పుడు వీరు ఆయా సమయానికి వచ్చి బయోమెట్రిక్ వేసుకోవడం ఆపై విధులకు డుమ్మా కొడుతున్నారు. కొన్ని సచివాలయాల్లో మూకుమ్మడిగా హాజరు వేసుకొని కార్యాలయాన్ని మూసేస్తున్నారు.

విస్తుపోయిన జెడ్పీ చైర్మన్..

తాజాగా ఉమ్మడి జిల్లా జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు పెద్దపంజాణి మండలంలోని శంకర్రాయలపేట సచివాలయాన్ని తనిఖీ చేసేందుకు వెళ్లగా సచివాలయానికి తాళం వేసి ఉన్నారు. పక్కనే ఉన్న వాళ్లు వచ్చి తాళం తెరిచారు. ఆయన గంటసేపు సచివాలయంలో ఉన్నా సిబ్బంది పత్తాలేకుండా పోయారు. మూడు రోజుల క్రితం వి.కోట మండలంలోని ఓగు సచివాలయాన్ని సందర్శించేందుకు వెళితే అక్కడ తాళం వేసి ఉన్నారు. దీంతో ఆయన ఉన్నతాధికారులకు తెలిపి సచివాలయ సిబ్బందికి నోటీసులు జారీచేయమన్నారు.

ఎంపీడీఓ నిర్లక్ష్యమే కారణమా?

గత ప్రభుత్వం నుంచి సచివాలయాలపై అజమాయిషీ ఆయా మండల ఎంపీడీఓలదే. వీరి డ్యాష్‌బోర్డుపై ఏఏ సచివాలయంలో సిబ్బంది బయోమెట్రిక్ వేశారనేది కనిపిస్తుంది. కానీ దీన్ని ఎంపీడీఓలు అసలు పట్టించుకోవడం లేదు. అసలు సచివాలయ సిబ్బందితో మాకు సంబంధమే లేదన్నట్టు వ్యవహరిస్తున్నారు.

నెలకు జీతం రూ.35వేలు వృథానేనా?

సచివాలయాల్లోని సిబ్బందికి నెలకు వేతనం రూ.35వేలుగా ఉంది. అంటే రోజుకి వెయ్యికిపైగానే. కానీ వీరు చేసేందుకు ఎలాంటి పనిలేకుండా పోయింది. వీరిపై పర్యవేక్షణ లేకుండా పోయింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక వీరిని ఆయా శాఖలకు మెర్జ్ చేస్తామన్నారు. మళ్లీ సచివాలయాలను బలోపేతం చేస్తామన్నారు. కానీ ఎలాంటి నిర్ణయం తీసుకోక సచివాలయ వ్యవస్థ రోజురోజుకి నిర్వీర్యమవుతోంది.

రాష్ట్ర స్థాయి పోటీలకు కుప్పం విద్యార్థినులు



పోటీలకు ఎంపికైన విద్యార్థినులతో వ్యాయామ ఉపాధ్యాయుడు లోకనాథం

కుప్పం రూరల్: రాష్ట్ర స్థాయి పోటీలకు మండలంలోని చందం ఉన్నత పాఠశాల విద్యార్థినులు ఎంపికైనట్లు హెచ్‌ఎం మార్కొండనాయుడు తెలిపారు. బుధవారం ఏకాంబరకుప్పంలో జరిగిన జిల్లా స్థాయి పోటీల్లో 9వ తరగతి చదువుతున్న రమ్య, రంజిత అండర్ –14 నెట్‌బాల్ విభాగంలో రాణించి రాష్ట్ర స్థాయికి ఎంపికైనట్లు ఆయన వివరించారు. ఎంపికైన వీరు నవంబర్ రెండో వారంలో విశాఖ జిల్లా గాజువాకలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో తలపడనున్నట్లు మార్కొండ నాయుడు తెలిపారు. రమ్య, రంజితకు శిక్షణ ఇచ్చిన వ్యాయామ ఉపాధ్యాయుడు లోకనాథంను పాఠశాల ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు అభినందించి సత్కరించారు.

ధ్వజస్తంభం ఏర్పాటుకు పూజలు

పుంగనూరు: పట్టణంలోని పురాతనమైన శ్రీకాశీ విశ్వేశ్వరస్వామి ఆలయంలో నూతన ధ్వజస్తంభం ఏర్పాటుకు పూజలు చేశారు. నాలుగేళ్ల కిందట శిథిలమైన ధ్వజస్తంభం స్థానంలో భక్తుల సహకారంతో కొత్త ధ్వజస్తంభం ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు.

పాముకాటుకు గురైన మహిళ



చికిత్సపొందుతున్న నేలమ్మ

పుంగనూరు: మండలంలోని నెక్కుంది గ్రామానికి చెందిన నేలమ్మ పొలంలో పనిచేస్తుండగా పాముకాటుకు గురైంది. బుధవారం ఆమె తన పొలంలో పనిచేసుకుంటుండగా కాలుపైన కాటువేసింది. వెంటనే కుటుంబీకులు ఆమెను స్థానిక ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకెళ్లారు. ప్రథమ చికిత్స అనంతరం అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం మదనపల్లె ఆస్పత్రికి తరలించారు.

వర్షానికి కూలిన ఇల్లు

- తప్పిన ప్రమాదం
- రూ.2లక్షల ఆస్తి నష్టం



కూలిన ఇంటిని పరిశీలిస్తున్న గ్రామస్తులు

రొంపిచెర్ల: రొంపిచెర్ల బజారువీధిలోని అల్లాబక్ష్ ఇల్లు ఇటీవల కురిసిన వర్షాల నేపథ్యంలో బుధవారం కూలిపోయింది. దీంతో ఇంటి అవరణలో నిలిపిన ద్విచక్ర వాహనం ధ్వంసమైంది. ఇల్లు కూలిన సమయంలో అప్రమత్తంగా వ్యవహరించి బయటకు పరుగులు తీయడంతో ప్రమాదం నుంచి అల్లాబక్ష్ బయటపడ్డారు. ఎలాంటి ప్రాణనష్టం జరగకపోవడంతో ప్రజలు ఊపిరి పీల్చుకున్నారు. ఈ ప్రమాదంలో రూ.2 లక్షల వరకు నష్టం వాటిల్లిందని బాధితుడు వాపోయారు. బాధితుడిని ప్రభుత్వం ఆదుకోవాలని గ్రామస్తులు కోరారు.

శుభదిన్ భోజన్‌లో దాతలకు అవకాశం



భోజనం వడ్డిస్తున్న ఉపాధ్యాయినులు

పలమనేరు: పట్టణంలోని బాలికోన్నత పాఠశాలలో బుధవారం శుభదిన్ భోజన్ కార్యక్రమాన్ని సైన్సు ఉపాధ్యాయురాలు పుష్పావతి ఆధ్వర్యంలో నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఎంఈఓ లీలారాణి హాజరై మాట్లాడారు. ఎవరైనా దాతలు ముందుకొచ్చి ప్రభుత్వ బడుల్లో ఓ పూట భోజనాన్ని ఏర్పాటు చేసే అవకాశం ఉందని తెలిపారు. ఇందుకు దాతలు ముందుకు రావాలని కోరారు. కార్యక్రమంలో హెచ్‌ఎం లత, ఉపాధ్యాయినులు పాల్గొన్నారు.

ఎంపీడీఓ తీరుపై ఎంపీపీ ఫైర్

- మండల మీట్ తీర్మానాలపై ఇంత నిర్లక్ష్యమా!
- మూడు రోజుల్లో సమాధానం ఇవ్వాలన్న ఎంపీపీ రోజా



ఎంపీడీఓకు వినతి పత్రాన్నిస్తున్న ఎంపీపీ రోజా

పలమనేరు: మండల మీట్‌లో చేసిన తీర్మానానికే విలువలేకుంటే ఇక ఎంపీడీఓ ఏమి చేసినట్టని ఎంపీపీ రోజా మండల ప్రజాప్రతినిధులతో కలసి ఎంపీడీఓ తీరుపై బుధవారం ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆమె ఓ వినతిపత్రాన్ని ఆయనకు అందజేసి అదే కాపీలను ఉన్నతాధికారులకు పంపనున్నట్టు తెలిపారు. ఆమె మాట్లాడుతూ ఈనెల 16న జరిగిన మండల మీట్‌లో జగమర్ల, మొరం, బయ్యప్పగారిపల్లి పంచాయతీల్లో అవసరమైన అభివృద్ధి పనుల కోసం ప్రతిపాదనలు చేశామని తెలిపారు. వీటిని సంబంధిత శాఖలకు పంపకుండా ఎవరి అనుమతి కోసం వేచి ఉన్నారని ఎంపీడీఓ ఖాదర్‌బాషాను ప్రశ్నించారు. మరోవైపు జెడ్పీ నిధులు రూ.32 లక్షలు మంజూరైతే వాటి ప్రతిపాదనలను ఎందుకు పంపలేదన్నారు. దీంతో ఆయన ఎంపీపీకి సరైన సమాధానం ఇవ్వలేదు. దీనిపై మూడు రోజుల్లో లిఖితపూర్వకంగా సమాధానం ఇవ్వాలని లేకుంటే న్యాయస్థానాన్ని ఆశ్రయిస్తామని ఎంపీపీ హెచ్చరించారు. ఎంపీడీఓ అధికార పార్టీకి కొమ్ముకాస్తుండడం కారణంగానే వివాదాలు వస్తున్నాయనే మాట వినిపిస్తోంది. విన్నవించిన వారిలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ బాలాజీనాయుడు, మండల సర్పంచుల సంఘ అధ్యక్షుడు విశ్వనాథరెడ్డి, ఎంపీటీసీలు, సర్పంచులు పాల్గొన్నారు.

ఏఆర్ ఏఎస్పీగా శివానంద కిషోర్

చిత్తూరు అర్బన్: చిత్తూరు జిల్లా ఏఆర్ ఏఎస్పీగా ఆర్.శివానంద కిషోర్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పనిచేస్తున్న నాగేశ్వరరావు స్థానంలో తిరుమల విజిలెన్స్‌లో డీఎస్పీగా ఉన్న శివానంద కిషోర్‌కు పదోన్నతిపై చిత్తూరుకు బదిలీ చేస్తూ ఇటీవల ఉత్తర్వులు వెలువడ్డాయి.

'పొలం పిలుస్తోంది' రండి



రాగానిపల్లిలో రైతులకు అవగాహన కల్పిస్తున్న జేడీఏ మురళీకృష్ణ

పుంగనూరు: పొలం పిలుస్తోంది కార్యక్రమంలో ప్రతిఒక్కరూ భాగస్వాములు కావాలని జిల్లా వ్యవసాయాధికారి మురళీకృష్ణ పిలుపునిచ్చారు. బుధవారం మండలంలోని రాగానిపల్లి గ్రామంలో ఏడీ శివకుమార్ ఆధ్వర్యంలో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. మురళీకృష్ణ మాట్లాడుతూ.. సాంకేతిక పరిజ్ఞానంతో రైతులకు అవసరమైన సలహాలు, సూచనలు ఈ కార్యక్రమం ద్వారా అందిస్తున్నామన్నారు. కార్యక్రమంలో ఏఓ ఫయాజ్, సిరికల్చర్, హార్టికల్చర్, వెటర్నరీ అధికారులు, రైతులు పాల్గొన్నారు.

భూసార పరీక్ష శ్రీరామ రక్ష

పులిచెర్ల (కల్లూరు): భూసార పరీక్ష పంటకు శ్రీరామరక్షగా నిలుస్తుందని మండల వ్యవసాయాధికారి శ్రీనివాస్ పేర్కొన్నారు. పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా చింతపల్లె, రాజులపల్లెలో పర్యటించి రైతులకు అవగాహన కల్పించారు. భూసార పరీక్షలు చేయించుకుని వ్యవసాయ శాఖ సిబ్బంది సూచనల మేరకు సాగు చేస్తే అధిక దిగుబడులు సాధించవచ్చన్నారు. అలాగే ఏటా పంట మార్పిడి విధానం అవలంబించాలన్నారు. రైతు సేవా కేంద్రం ఇన్‌చార్జ్ తేజ, లీల పాల్గొన్నారు.



బైరెడ్డిపల్లె చెక్‌పోస్టు వద్ద బస్సు ఎక్కేందుకు కిక్కిరిసిన విద్యార్థులు

చదవాలంటే.. సర్కస్ ఫీట్లే !

బైరెడ్డిపల్లి: విద్యార్థులకు అనుగుణంగా బస్సు సర్వీసులు లేకపోవడంతో పాఠశాల, కళాశాలలకు వెళ్లేందుకు అష్టకష్టాలు పడుతున్నారు. బైరెడ్డిపల్లె నుంచి పలమనేరులో చదువుకునేందుకు 1000 మంది విద్యార్థులు నిత్యం రాకపోకలు సాగిస్తుంటారు. స్తోమత ఉన్న తల్లిదండ్రులు తమ పిల్లలను కళాశాలలకు చెందిన బస్సుల్లో పంపుతున్నారు. మరోవైపు పేద విద్యార్థులకు ఆర్టీసీ బస్సులే దిక్కవుతున్నాయి. విద్యార్థులకు మాత్రమే ప్రత్యేకంగా ఆర్టీసీ బస్సులు ఉన్నా సమయపాలన లేకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వి.కోట నుంచి వచ్చే ఆర్డినరీ సర్వీస్‌లో ప్రయాణికులే అధికంగా ఉంటారు. అయితే విద్యార్థులకు నిలబడే చోటు లేకపోవడంతో ప్రతిరోజూ సర్కస్ ఫీట్లు తప్పడం లేదు. ఆర్టీసీ అధికారులు స్పందించి విద్యార్థులకు సరిపడా బస్సు సర్వీసులు ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.

బీఎంఎస్ క్లబ్ మైదానంలో టపాసుల విక్రయాలు



మాట్లాడుతున్న కమిషనర్ మధుసూదన్‌రెడ్డి

పుంగనూరు: దీపావళి పండుగను పురస్కరించుకుని స్థానిక బీఎంఎస్ క్లబ్ మైదానంలో టపాసుల విక్రయాలు నిర్వహించేందుకు స్థలాన్ని ఎంపిక చేసినట్లు కమిషనర్ మధుసూదన్‌రెడ్డి తెలిపారు. బుధవారం తహసీల్దార్ రాము, అగ్నిమాపకశాఖ అధికారి సుబ్బరాజు, ఏఎస్‌ఐ దామోదరంతో కలసి మైదానాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ.. టపాసులతో ప్రమాదాలు జరగకుండా ఉండేందుకు ఈ స్థలాన్ని ఎంపిక చేశామన్నారు. దుకాణాలకు ప్రతి దానికి కొంత దూరం ఏర్పాటు చేసి, దుకాణాలు నిర్మించాలన్నారు. ఇసుక, నీరుతో పాటు అగ్నిమాపక నియంత్రణకు అవసరమైన పరికరాలను తప్పకుండా ఏర్పాటు చేసుకోవాలన్నారు. అనుమతులు లేకుండా దుకాణాలు ఏర్పాటు చేస్తే చర్యలు తీసుకుంటామన్నారు.

వర్షార్పణం

- వానల దెబ్బకు బొప్పాయి పంట నష్టం
- ధర ఉన్నా కొనుగోలు చేయని వ్యాపారులు
- పొలాల్లోనే కుళ్లిపోతున్న పంట



బైరెడ్డిపల్లె పెద్దచెరువు సమీపంలో పొలాల్లోనే వదిలేసిన బొప్పాయి



చీలంపల్లె వద్ద కుళ్లిపోయిన బొప్పాయిని పారబోసిన రైతు

బైరెడ్డిపల్లి: ఎడతెరపిలేని ముసురు వర్షాలు కురుస్తుండడంతో ఆరుగాలం శ్రమించి పండించిన బొప్పాయి పంట పొలాల్లోనే కుళ్లిపోతోందని రైతులు ఆవేదన చెందుతున్నారు. ప్రభుత్వం ఆదుకుంటుందనే నమ్మకం లేకపోవడంతో అన్నదాతకు కన్నీళ్లు తెప్పిస్తున్నాయి. వాయుగుండం ప్రభావంతో వారం రోజులుగా వర్షాలు కురుస్తూనే ఉన్నాయి. బొప్పాయి పంటకు ధర బాగా ఉందని సంబరపడిన రైతులకు వర్షం నిరాశ మిగిల్చింది. 10 రోజుల క్రితం బొప్పాయి కేజీ ధర రూ.20 పలకడంతో ఇతర ప్రాంతాల నుంచి వ్యాపారస్తులు బొప్పాయి తోటల వద్దకే వచ్చి కొనుగోలు చేశారు. అయితే కలకత్తా, ఢిల్లీ, చెన్నై ప్రాంతాల్లో వర్షాలు బాగా కురుస్తుండటంతో వ్యాపారులు బొప్పాయి కొనుగోలు చేసేందుకు ముందుకురాలేదు. ఫలితంగా పొలాల్లోనే కాయలు రంగు మారి కుళ్లిపోతున్నాయి. ఎడతెరపి లేని వర్షాల మూలాన బొప్పాయిపై తెగుళ్లు ఆశించి తీవ్ర నష్టం కలుగుతోంది. మండలంలో సుమారుగా 400 ఎకరాల వరకు రైతులు బొప్పాయి సాగు చేసినట్లు వ్యవసాయశాఖ లెక్కలు చెబుతున్నాయి.

వ్యాపారస్తులు రాలేదు

అన్నదాతను ప్రభుత్వం ఆదుకోకపోయినా అప్పులు చేసి బొప్పాయి పంట సాగు చేశాం. పంట దిగుబడి బాగా వచ్చింది. కోతదశలో ధరలు బాగా ఉన్నా వర్షం కారణంగా వ్యాపారస్తులు రాలేకపోతున్నారు. ఢిల్లీ కటింగ్ చేస్తే ధర బాగా పలుకుతుంది. అయితే వర్షాలు ఉండడంతో పొలాల్లోనే తెగుళ్లు సోకుతూ కుళ్లిపోతున్నాయి. పంట పండినా ఫలితం లేదు. రైతులను ఆదుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది.



–గణేష్, చీలంపల్లె

ప్రత్యామ్నాయ పంటలకు ప్రోత్సాహం



రైతులకు అవగాహన కల్పిస్తున్న ఉద్యానశాఖ అధికారులు

పలమనేరు: జిల్లాలో మామిడి సాగు ఎక్కువగా ఉన్నందున ఏటా ధరలు గిట్టుబాటు కాని పరిస్థితి నెలకొంటున్నందున రైతులు దానికి ప్రత్యామ్నాయంగా సీతాఫలం, జామ, జీడి మామిడి, ఉసిరి, చింత పంటల సాగుకు ప్రభుత్వం ప్రోత్సాహకాలు అందజేస్తుందని జిల్లా ఉద్యానాధికారి మధుసూదన్‌రెడ్డి పేర్కొన్నారు. స్థానిక రైతు సేవా కేంద్రం వద్ద బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమానికి ఆయన హాజరై రైతులకు అవగాహన కల్పించారు. ప్రత్యామ్నాయ పంటల సాగు చేసే రైతులకు ఉద్యానశాఖ ప్రోత్సాహకంగా హెక్టారుకు రూ.18 వేల నుంచి 25 వేల దాకా అందిస్తుందని తెలిపారు. ఏపీఎంఐపీ పీడీ బాలసుబ్రహ్మణ్యం మాట్లాడుతూ.. అయిదెకరాలలోపు ఉన్న చిన్న, సన్నకారు రైతులకు 90 శాతం రాయితీ, పెద్దరైతులకు 45 శాతంతో బిందుసేద్య పరికరాలను అందిస్తామని ఈ సందర్భంగా తెలిపారు. కార్యక్రమంలో ఏడీఏలు అన్నపూర్ణదేవి, విజయశంకర్‌రెడ్డి, ఏఓ సంధ్యారాణి, ఏఈఓ కుమార్ పాల్గొన్నారు.